

'యువగళం' ప్రతి హామీ నెరవేరుస్తా

- డయాలసిస్ సెంటర్ ప్రారంభం
- అకనంబట్టు స్కూల్లో ఆకస్మిక తనిఖీలు
- 'ప్రజాదర్బార్'లో వినతులు స్వీకరణ
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నారా లోకేష్ పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, బంగారుపాళ్యం

యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. యువగళం 100 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా ఇచ్చిన తొలి హామీ మేరకు గ్రామస్తుల ఆనందోత్సాహాల మధ్య బంగారుపాళ్యంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో చిత్తూరు జిల్లా సమగ్రాభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. గత ఏడాది జనవరి 27వ తేదీన కుప్పం శ్రీ వరదరాజస్వామి పాదాల చెంత నుంచి తాను ప్రారంభించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిందన్నారు. 11ఉమ్మడి జిల్లాలు, 97 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 2200 గ్రామాలను స్పృశిస్తూ 3132 కి.మీ.ల మేర యువగళం పాదయాత్ర సాగిందని గుర్తు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో మరెవరూ చేయనివిధంగా 14 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ 45రోజులపాటు 577 కి.మీ.ల మేర కొనసాగిన యువగళం పాదయాత్ర రికార్డు సృష్టించిందన్నారు. యువగళం పాదయాత్ర 8వ రోజు 2023, ఫిబ్రవరి 3న బంగారుపాళ్యంలో వంద కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తొలి మైలురాయిని ఆవిష్కరించానన్నారు. డయాలసిస్ కేంద్రం అవసరమని స్థానికులు చెప్పిన మేరకు ఇపుడు నెరవేర్చానన్నారు. బంగారుపాళ్యం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారని, తరచూ డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లడానికి డబ్బు, సమయం అవుతుందన్నారు. ప్రస్తుతం తమ ప్రాంతంలోనే ఉచితంగా డయాలసిస్ చేయించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. బంగారుపాళ్యంలో కొత్తగా నిర్మించిన 30 పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తూ టిడిపి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, పూతలపట్టు ఎంఎల్ఎ మురళీమోహన్, చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని పాల్గొన్నారు.



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేష్

చేసిన పని చెప్పుకోవాలి

'ప్రజలు మనపై పవిత్ర బాధ్యత పెట్టారని, దాన్ని హుందాగా నెరవేర్చాలి' అని లోకేష్ అన్నారు. శుక్రవారం ఉదయం ఎస్ఎల్‌వి కల్యాణ మండపంలో 'ఉత్తమ కార్యకర్త', 'మన టిడిపి యాప్ ఛాంపియన్స్' సమావేశం నిర్వహించారు. టిడిపి యాప్ ద్వారా ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. చెప్పింది చేయాలని, చేసిన పని చెప్పుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. క్యాస్టర్ గద్దల మారిన పాపాల పెద్దిరెడ్డిని వదిలిపెట్టేది లేదని, చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని ఉద్ఘాటించారు. తాము అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే అనేక హామీలు నెరవేర్చామన్నారు.

టీటీడీ పవిత్రతను కాపాడతాం

'తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారు' అని విని షాకయ్యాం. ఇందుకు సంబంధించిన రిపోర్ట్‌లను బయట పెట్టాం. తిరుమలలో ప్రమాణానికి సిద్ధమని టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సవాల్ విసిరారని, తాను తిరుపతిలోనే ఉన్నానని, ప్రమాణానికి సిద్ధం అని అన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేవిధంగా చర్యలు చేపడతాం అన్నారు.

మోడల్ స్కూళ్లలా తీర్చిదిద్దుతాం


ప్రభుత్వ పాఠశాలలను ఎపి మోడల్ స్కూళ్లగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేష్ అన్నారు. పూతలపట్టు నియోజకవర్గం అకనంబట్టు జడ్‌పి హైస్కూల్లో మంత్రి నారా లోకేష్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతి గదులను సందర్శించారు. లోటుపాట్లపై విద్యార్థులను ఆరా తీశారు. కొంతమంది విద్యార్థులు ఇంకా తమకు టెక్స్ట్ బుక్స్ అందలేదని చెప్పడంతో తక్షణమే అందేలా చూడాలని ఆదేశించారు. బెంచీలు లేకపోవడంతో నేలపై కూర్చోవాల్సి వస్తుందని చెప్పగా, త్వరలోనే ఫర్నిచర్ ఏర్పాటు చేస్తామన్నారు. మూడు నెలలుగా గతం కంటే టాయిలెట్స్ మెరుగ్గా ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 70 శాతమే ఉండటానికి కారణమేంటని ప్రధానోపాధ్యాయురాలిని, టీచర్లను ప్రశ్నించారు. రవాణా సౌకర్యం మెరుగు పరచాలని టీచర్లు తెలిపారు. విద్యార్థులు ట్యాబ్‌లలో అనవసరమైన కంటెంట్ చూస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, టీచర్లు డేగకన్ను వేసి ఉంచాలని సూచించారు. కొన్ని తరగతి గదులు పెచ్చులూడుతున్నాయని టీచర్లు చెప్పగా, మరమ్మత్తులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు, టీచర్లతో లోకేష్ ఫోటోలు దిగారు.

వినతులు స్వీకరించిన మంత్రి

ఎస్ఎల్‌వి కల్యాణ మండపంలో 'ప్రజాదర్బార్' జరిగింది. అంగన్‌వాడీలు 42 రోజుల సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాల ఆధారంగా పెండింగ్‌లో ఉన్న జీవో ఇవ్వాలని, వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తన మనవరాలి ఆలనాపాలనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బేకుమందకు చెందిన వడ్డి గోవిందమ్మ కోరారు. జీవో 117రద్దుతో పాటు, సిపిఎస్‌పై నిర్ణయం తీసుకోవాలని, డిఎస్‌సి 2023 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కోరారు. స్టాఫ్ నర్సు నియామకాల్లో అక్రమాలను సరిదిద్దాలని రామసముద్రానికి చెందిన ఎస్.దివ్య కోరారు. తిరుపతిలో హథీరాం బాబాజీ అన్యాక్రాంత భూములను బంజారాల ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డు ఏర్పాటుచేయడంతో పాటు ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని శ్రీ స్వామి హథీరాం బాబాజీ పరిరక్షణ కమిటీ విజ్ఞప్తి చేసింది. మొగిలి పంచాయతీ యానాదుల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, నగరిలో ఉన్న వేలాదిమంది పవర్‌లూం కార్మికులకు విద్యుత్ స్లాబ్ తగ్గించాలని, చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు వినతిపత్రం అందజేశారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



విద్యార్థులతో...



రోగిని పరామర్శిస్తూ..

'యువగళం' స్మృతులను నెమరువేసుకుంటూ

మంత్రిగా చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన లోకేష్ గత యువగళం జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గతంలో తన సభను అడ్డుకోవడంతో ఎదురుగా భవనం పైకి ఎక్కి తాను ప్రసంగించిన ప్రదేశాల్లో సెల్ఫీ తీసుకున్నారు. బంగారుపాళ్యం పర్యటన ముగించుకుని తిరిగి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు వెళుతున్నపుడు ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. యువగళం పాదయాత్ర సాగే సమయంలో గాదంకి టోల్‌గేటు వద్దకు టీ తాగారు. శుక్రవారం ఈ విషయాన్ని చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని గుర్తు చేయగా, కాన్వాయ్‌ని ఆపి మంత్రి లోకేష్ మురగన్ టీ స్టాల్‌లో కార్యకర్తలతో కలిసి 'చాయ్' తాగారు.



మురగన్ టీ స్టాల్‌లో తేనీరు సేవిస్తూ...



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న అంగన్‌వాడీలు

ఉన్నత స్థాయి విచారణ జరపాలి : సిపిఎం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల శ్రీవారి లడ్డూల తయారీలో జరిగిన అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. టిటిడి లడ్డూలో వాడుతున్న నెయ్యి కల్తీ జరిగిందని, ఇతరేతర పదార్థాలు వాడారని జరుగుతున్న ప్రచారంతో శ్రీవారి భక్తుల్లో ఆందోళన కలుగుతోందన్నారు. ప్రభుత్వం ఎన్‌డిడిబి రిపోర్టును అధికారికంగా ప్రకటించి విచారణ జరపాలని కోరారు. టిటిడి ఉన్నతాధికారులు రిపోర్టు వివరాలను వెల్లడించాలన్నారు. వివాదం మాటున మత మనోభావాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, ఇలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

కల్తీ పదార్థాల వినియోగం హేయం

డక్కిలి : లడ్డూ ప్రసాదాల తయారీలో నాశిరకమైన పదార్థాలను ఉపయోగించిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎపి ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

తిరుమలను భ్రష్టుపట్టించింది ధర్మారెడ్డే : కాంగ్రెస్

తిరుమల ప్రతిష్టను భ్రష్టు పట్టించింది టిటిడి మాజీ ఈవో ధర్మారెడ్డి అని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు దిండిగల్‌కు చెందిన ఎఆర్ ఫుడ్స్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టిన టిటిడి, సదరు సంస్థపై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదన్నారు. ఎఆర్ ఫుడ్స్ సంస్థకు టెండర్ అనుమతి ఇచ్చింది అప్పటి ఈవో ధర్మారెడ్డి అన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో కీలకమైన వారిపై టిటిడి చర్యలు తీసుకోకపోతే పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

శ్రీకాళహస్తిలో... టిడిపి నాయకులు డాక్టర్ ఎం.ఉమేష్‌రావు మాట్లాడుతూ కల్తీ కారకులను ఉరి తీయాలన్నారు. వైసిపి హయాంలో కర్నాటక రాష్ట్రానికి చెందిన నందిని బ్రాండ్ నెయ్యిని అర్థాంతరంగా ఎందుకు ఆపేయాల్సి వచ్చిందో వివరించాలన్నారు. తిరుమలలో వివిధ ప్రసాదాల తయారీకి టిటిడి నెలకు 42 వేల కిలోల నెయ్యి, 22 వేల 500 కిలోల జీడిపప్పు, 15 వేల కిలోల ఎండుద్రాక్ష, 6వేల కిలోల యాలకులు, శనగపిండి, చక్కెర తదితర పదార్థాలను సేకరిస్తున్నదని, వీటి నాణ్యతపై కూడా శాస్త్రీయంగా పరీక్షలు జరిపించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పుంగనూరులో... భక్తుల మనోభావాలు దెబ్బతీశారని, ఈ పాపం వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌కే చెల్లుతుందని బిసివైపి రాష్ట్ర అధ్యక్షులు బోడే రామచంద్రయాదవ్ అన్నారు. ఎన్‌ఎస్‌పి అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్ పాలనలో స్వామివారిని అపవిత్రం చేశారన్నారు. బాధ్యులపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసివై పార్టీ నాయకులు సాంబమూర్తి, మాజీ ఏఎంసి చైర్మన్ హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం.!

- ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: సంక్షోభంలోనూ సంక్షేమం అందించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలో కమిషనర్ వార్డు బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ విచ్చేశారు. ముందుగా ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించారు. అధికారులు వీలైనంత వరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడానికి తమ వంతు చర్యలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలన వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు. అయినా ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్‌డీఏ కూటమి, సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందజేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. భవిష్యత్తులోనూ ఎన్‌డీఏ కూటమి ప్రజా రంజక పాలనను సాగిస్తుందని ఆశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జిమ్ దాము, నాయకులు రాజకుమార్, వేలు, జాకీర్ అహ్మద్, శివశంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అవమానం భరించలేకే మహిళ ఆత్మహత్యాయత్నం

- నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్
- విలేకరులతో కుటుంబీకులు



మాట్లాడుతున్న బాధితురాలి కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: అవమానాన్ని భరించలేక మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శాంతిపురం మండలం వెంకటేష్ పురం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యులు శ్రీనివాసులు, చంద్రశేఖర్‌లు శుక్రవారం కుప్పంలో విలేకరులతో సమావేశమై మాట్లాడారు. తమ ఇంట స్నానపు గదికి పైకప్పు లేకపోవడంతో తమ ఇంటి మహిళలు స్నానం చేస్తున్న సమయంలో తమ సమీప బంధువు వెంకటేష్ స్నానం చేస్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్టు తెలిపారు. బాధిత మహిళలు నిందితుడిని ప్రశ్నించగా మహిళలపై ఎదురు దాడి చేసి, గుడ్డలు చించి అవమానించినట్టు తెలిపారు. మహిళలు సమాచారాన్ని తమ దృష్టికి తీసుకురాగా రాళ్ళబుదుగురు పోలీసులను ఆశ్రయించామన్నారు. తమకు న్యాయం చేయవలసిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఫిర్యాదును స్వీకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు పాల్పడ్డ మహిళ మృత్యువాత పడితే అందుకు తనను అవమానించిన నిందితుడుతో పాటు రాళ్ళబుదుగురు పోలీసులు కూడా బాధ్యులవుతారని బాధితులు ఆగ్రహావేశంతో రగిలిపోయారు. తమకు న్యాయం జరగకపోవడంతో కుప్పం పాత్రికేయులను ఆశ్రయించామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే ఆదేశాలు డోంట్ కేర్.!

- కౌండిన్యలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- బరితెగించిన 'తమ్ముళ్లు'
- జేసీబీలతో కొనసాగుతున్న తవ్వకాలు



కౌండిన్యలో ఇసుక తవ్వుతున్న జేసీబీ

ప్రజాశక్తి-గంగవరం:

ప్రభుత్వం మారిందంతే.. అక్రమాలు, ధనార్జన, దోపిడీ యథాతథం. ఇదీ అధికార పార్టీ నేతల పరిస్థితి. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న నానుడిని సీరియస్‌గా తీసుకున్న తమ్ముళ్లు బరితెగిస్తున్నారు. మండలంలోని కౌండిన్య నదిలోంచి ఇసుకను తరలించేస్తున్నారు. భారీగా డంప్ చేసి ఇసుకను అమ్ముకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయంగా ఇటీవల వివిధ పత్రికల్లో వార్తా కథనాలు వెలువడ్డాయి. స్పందించిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఇసుక అక్రమ రవాణా చేపట్టకూడదని మండల నేతలను హెచ్చరించారు. కేవలం ఇంటి నిర్మాణాల అవసరాల కోసం మాత్రమే ఉచితంగా కూలీల ద్వారా లోడింగ్ చేసి తరలించుకోవచ్చునని సూచించారు. అయినా ఎమ్మెల్యే మాటలు ఖాతరు చేయని స్థానిక నాయకులు జేసీబీల సాయంతో యథేచ్ఛగా ఇసుకను తరలించేస్తున్నారు. అలవాటు పడ్డ ఇసుకాసురులను అడ్డుకుంటారో.. మనవారేనని చూసి మిన్నకుండిపోతారో.. పాలకులు, అధికారులే చూసుకోవాల్సి ఉందని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పారిశుద్ధ్య పనుల తనిఖీ



పారిశుద్ధ్య పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంతపేట పీఎన్సీ హై స్కూల్ మైదానంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం కమిషనర్ వన్నియర్ బ్లాక్, బజార్ స్ట్రీట్, హైరోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా, సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఉదయం 8గంటల లోపు ప్రధాన రహదారులు, వీధులు శుభ్రం చేసే పనులు పూర్తి చేయాలని, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. డంపర్ బిన్లలో చెత్త సకాలంలో క్లియర్ చేయాలని, డంపర్ బిన్ల వద్ద అపరిశుభ్రంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశించిన సమయం వరకు పారిశుద్ధ్య కార్మికులు పనులు చేసేలా పర్యవేక్షించాలని వార్డు కార్యదర్శులు, సానిటరీ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ లోకానాథం పాల్గొన్నారు.

రాజధాని చంద్రబాబుతోనే సాధ్యం

- చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

రాష్ట్ర రాజధాని సీఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. శుక్రవారం నగరంలోని సంతపేట పీఎన్‌సీ నగర పాలకోన్నత పాఠశాల క్రీడా మైదానంలో కూటమి ప్రభుత్వం 100రోజుల సుపరిపాలన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ మూడు రాజధానుల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ఒక్క రాజధాని ప్రకటించి దాని రూపకల్పన చేసిన ఘనుడు సీఎం చంద్రబాబు అన్నారు. 1వ తేదీనే పింఛను, పేదలకు ఇండ్లు ఇంటి స్థలాలు, వరద సమయంలో బాధితులను సకాలంలో ఆదుకొని ప్రాణనష్టం జరగకుండా కాపాడిన ఏకైక వ్యక్తి చంద్రబాబు మాత్రమేనన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. భవిష్యత్తులో మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీలను నెరవేర్చి ప్రజల మన్ననలు కూటమి ప్రభుత్వం పొందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, మేయర్ అముద, నాయకులు వసంత్ కుమార్, శ్రీనివాసులు, రామభద్ర, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, సంతపేట ఈశ్వర్, 45వ వార్డు సిఎం విజయ, సిఎం మురళీ, 46వ వార్డు సురేష్, 47వ వార్డు ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతకై నడుం బిగిద్దాం

- నగరపాలక ఆరోగ్య అధికారి డాక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని నగరపాలక ఆరోగ్య అధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. నగరంలో జైహింద్ పాఠశాలలో విద్యార్థులు, మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి ర్యాలీ, స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎంహెచ్వో మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత కోసం విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భాగస్వాములు కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రత అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆ తరువాత నాగాలమ్మ ఆలయం వద్ద నిల్వ నీటిలో ఆయిల్స్ బాల్స్ వేశారు. వివిధ వార్డులలో దోమల నియంత్రణకు స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు లోకానాంధం, నరసింహ, హెచ్‌ఎంలు బాలసుబ్రహ్మణ్యం, ముక్తార్ అహ్మద్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కో-ఆప్షన్ సభ్యునిపై దాడి

ప్రజాశక్తి-పూతలపట్టు: వైసీపీకి సంబంధించిన మైనారిటీ కో-ఆప్షన్ సభ్యునిపై దాడి జరిగిన సంఘటన గురువారం రాత్రి పూతలపట్టు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండలం మైనార్టీ విభాగంకు చెందిన కో-ఆప్షన్ మెంబర్ ఖాదరవల్లి వృత్తిరీత్యా పాలు సేకరించి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పాలు సేకరించుకుని వస్తుండగా అంబేద్కర్ సర్కిల్ వద్ద ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. తీవ్రగాయాలతో ఉన్న ఖాదర్‌వల్లీని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదే రాత్రి ఇదే వ్యక్తికి సంబంధించిన భూమిలోని కంచ కోసం ఏర్పాటు చేసిన రాతికూసాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు.

పంచాయతీ ఆడిట్‌పై అనుమానాలు

ప్రజాశక్తి-విజయపురం:

మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో అధికారులు ఆడిట్ చేపడుతున్నారు. రోజుకో పంచాయతీ చొప్పున ఆడిట్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం పన్నూరు సచివాలయంలో జరిగిన కలియంబాకం పంచాయతీ ఆడిట్ మొక్కుబడిగా సాగిందని పలువురు ఆరోపిస్తున్నారు. కనీసం వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వలేదని, అధికారులు వచ్చివెళ్లే సమాచారం కూడా తెలియడం లేదని వార్డు సభ్యులు వాపోతున్నారు. కలియంబాకం పంచాయతీ అభివృద్ధికి 2023-24 ఏడాదికి గానూ రూ.10,93,477 మంజూరైనట్లు అధికారుల లెక్కలు చెబుతుండగా అందులో రూ.10,92,753లు ఖర్చు చేసినట్లు చూపించారు. అంత మేరా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన జరగలేదని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం చేపడుతున్న ఆడిటింగ్‌పై గ్రామ సభ నిర్వహించి వివరాలను ప్రజలకు తెలియజేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చినుకు కురవక.. చేను తడవక

- ఓ వైపు అతివృష్టి.. మరోవైపు అనావృష్టి
- ప్రకృతిలో పెను మార్పులు.. ప్రజలు అతలాకుతలం
- ఎండుతున్న వేరుశనగ పంటలు



ప్రకృతి ఏ రోజున ఏ రూపు దాల్చుతుందో తెలయని పరిస్థితి. ఓ వైపున వర్షాలు.. మరో పక్క తీవ్ర వర్షాభావ పరిస్థితులు. ఒక చోట వరదలకు నీట మునిగిన పంటలు.. ఇంకో చోట వర్షాలు కురవక ఎండుతున్నాయి. రైతులు గంధరగోల పరిస్థితుల్లో ఉంటున్నారు. కోస్తాలో జలప్రళయం సంభవించగా.. సీమలో కరువు కోరలు చాస్తోంది. దీంతో ఖరీఫ్ సాగు చేసిన రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. పంటలు వెలవెలబోతుండగా.. కర్షకులు విలవిలలాడుతున్నారు.

ప్రజాశక్తి-పూతలపట్టు:

జిల్లాలో కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. సకాలంలో వర్షాలు కురవక ఖరీఫ్ సాగు ఎండిపోతోంది. చేతికందే సమయంలో పంట కళ్లేదుటే వాడిపోతుండా రైతన్న కంట కన్నీరు ఆగడం లేదు. వ్యవసాయాన్నే నమ్ముకొని పంట కోసం అప్పుల ఊబిలో కూరుకుపోయి మరింత అప్పు చేసి పంట సాగు చేసిన అన్నదాతలు భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నారు. చేసిన అప్పులు తీర్చలేక.. పంట చేతికొస్తుందో రాదోనన్న భయం రైతన్నలను వెంటాడుతోంది.

45వేల మంది రైతుల ఆశలు అడియాశలే..

జిల్లాలో మొత్తం 35,156హెక్టార్లలో వేరుశనగ పంట సాగులో ఉంది. ఇందులో 60శాతం పంట ఎండు ముఖం పట్టినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. మిగిలిన 40శాతం పంటను రైతులు సాగునీటి ద్వారా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో 45వేల మంది రైతులు ఈ పంట నమోదు చేసుకున్నట్టు తెలుస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈమారు ఖరీఫ్లో పంట నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్టు అంచనా.. ఒక్క పూతలపట్టు మండలంలో 2007హెక్టార్లలో వేరుశనగ పంట సాగులో ఉండగా.. ఇందులో ప్రస్తుతానికి సుమారు 300హెక్టార్లలో పంట పూర్తిగా దెబ్బతింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.


ఆరంభంలో ఆశాజనకమైన వర్షాలతో..

ఖరీఫ్ సీజన్ మొదట్లో వర్షాలు ఆశాజనకంగా.. విస్తారంగా కురవడంతో రైతులు వ్యవసాయంపై అధికంగా మక్కువ చూపించారు. వర్షాధార పంట అయిన వేరుశనగ పంట సాగుపై రైతులు అత్యధికంగా మొగ్గు చూపారు. ఆగస్టు మొదటి వారంలో వర్షాలు విస్తారంగా పడడంతో అప్పులు చేసి మరి వ్యవసాయం వైపు అడుగులు వేశారు. కానీ వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు ఎండు ముఖం పడుతున్నాయి. మరో నాలుగు, ఐదు రోజుల్లో వర్షాలు పడకుంటే రైతులు పంటను పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు కాస్తో కూస్తో పంటను కాపాడుకుంటుంటే వర్షాన్ని నమ్ముకున్న రైతులు నిట్ట నిలువునా మునిగిపోతున్నారు.

కారుమేఘం రాక కోసం కన్నార్పని కర్షకులు..

వేల రూపాయలు అప్పులు చేసి వ్యవసాయం చేసిన రైతన్నల కళ్ళముందే పంటలు ఎండిపోతుంటే ఏమీ చేయలేని స్థితిలో మిన్నకూండిపోతున్నారు. చేసేది ఏమీ లేక సాయంత్రం సమయాలలో ఏర్పడుతున్న మబ్బుల వైపు ఆశగా ఆకాశం వైపు ఎదురు చూడడం తప్ప. కొన్నిచోట్ల ఎండిన పంటకు ట్యాంకర్ల ద్వారా నీరు పట్టి వచ్చిన కాడికి పంటను ఒబిడి చేసుకుంటున్నారు. వెనుక వేసిన పంటలను మాత్రం ఏమీ చేయలేని పరిస్థితి.

యూరియా పిచికారి చేస్తే ఉపయోగం..



ఎండుతున్న వేరుశనగ పంటలకు ఒక లీటరు నీటిలో 20గ్రాముల యూరియాను కలిపి పిచికారి చేయడం వలన కొంతవరకు ఉపయోగకరంగా ఉంటుంది. దీని ద్వారా 20రోజుల వరకు పంటను కాపాడుకోవచ్చు. రైతులు వెంటనే ఈ దిశగా అడుగులు వేయాలి. పక్వానికి వచ్చిన పంటను వెంటనే ఒబిడి చేసుకోవడం చాలా వరకు ఉత్తమం.

- మధురవాణి, వ్యవసాయ అధికారిని, పూతలపట్టు

జ్వరాలు.. పల్లెలపై కోరలు..


చవనపల్లిలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు

- వెదురుకుప్పం మండలంలో హడల్
- అలుముకుంటున్న విషజ్వరాలు
- ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిట
- గ్రామాల్లో కొనసాగుతున్న మెడికల్ క్యాంపులు
- ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల ప్రజలపై విష జ్వరాలు కోరలు చాస్తున్నాయి. ప్రజలు చలిజ్వరాలతో వణికిపోతున్నారు. మంచానికి పరిమితమవుతున్నారు. గతం వారం రోజులగా జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజుకి పెరుగుతోంది. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఈ విష జ్వరాల బారినపడి బాధపడుతున్నారు. దీంతో రోజురోజుకు బక్క చిక్కు పోతున్నారు. జలుబు, దగ్గు, తలనొప్పి, జ్వరాలతో ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. వైద్యాధికారులు సీజనల్ వాధులుగా భావిస్తున్నారని, రక్త పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులంటున్నారు. ఆ దిశగా వైద్యులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. మరీ కొంతమంది ప్రైవేటు ఆసుపత్రికి వెళుతున్నారు. ఎక్కడి ఆసుపత్రిలో చూసినా జనంతో నిండిపోతున్నారు. వీరంతా పల్లె వాసులే కావటం గమనార్హం. జిల్లాలో ఏడాది నుంచి డెంగీ కేసులతో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటి వరకు 174మంది డెంగీ బారిన పడినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. వెదురుకుప్పం మండలంలో ఇటీవల కాలంలో ఐదు డెంగీ కేసులు నమోదైనట్లు ప్రభుత్వ వైద్యులు నిర్ధారణకు వచ్చారు. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుందని అంచనా. మండలంలో 25 పంచాయతీలు ఉండగా 222 రెవిన్యూ గ్రామాలున్నాయి. పచ్చికాపల్లంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా వెదురుకుప్పం, తిరుమలయ్యపల్లె, దేవలంపేటలో సబ్ సెంటర్‌లు ఉన్నాయి. గత వారం రోజులుగా పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జ్వరాలతో వస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటోందని స్థానికులంటున్నారు. రోజువారి ఓపీల సంఖ్య క్రమేనా పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఇక మండలంలోని చవనపల్లిలో గురువారం రోజు 20మందికి పైగా ఈ విష జ్వరాల బారిన పడి మంచం పట్టారు. అదే గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్యాధికారులు వైద్య సేవలు అందించారు. పెద్దఎత్తున విషజ్వరాలు అలుముకుంటున్న నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవలు విస్తృతం చేయడంతో పాటు మరో వైపు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సి ఉందని పలువురు కోరుకుంటున్నారు.

నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రికి రావాలి



జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రికి రావాలి. రక్త పరీక్షలు చేసి, వైద్యం అందిస్తాం. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేదు. వాతావరణ పరిస్థితులు వల్ల కాచి చల్లార్చిన నీళ్లను తాగాలి. వేడిగా అన్నం తినాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమతెరలు తప్పనిసరిగా వాడాలి. చిన్నపిల్లలకు తేలికపాటి ఆహారాన్ని అందించాలి. నూలు దుస్తులు ఎక్కువగా ధరించాలి. సూచనలు పాటిస్తే కొంతవరకు విషజ్వరాల బారి నుంచి దూరంగా ఉండొచ్చు.

డాక్టర్, సురేఖ, పచ్చికాపల్లం

మొగిలి ఘాట్‌లో మరో ప్రమాదం

- మినీ వ్యాన్‌ను ఢీకొన్న బొలెరో
- నలుగురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు


వెనుక నుంచి వ్యాను ఢీకొనడంతో అదుపుతప్పి ఒరిగిన టెంపొట్రావెలర్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మినీ వ్యాన్ ఢీకొని నలుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం ఉదయం మండలంలోని మొగిలి ఘాట్లో చోటు చేసుకుంది. ఏఎస్ఐ రామచంద్రారెడ్డి కథనం మేరకు.. పలమనేరు నుంచి చిత్తూరుకి మినీ వ్యాన్లో వెళుతుండగా దొరచెరువు సమీపంలో గల మలుపు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద మినీ వ్యాన్ దాటుతుండగా వెనక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో మినీ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న కుమార్, మోహన్, సతీష్, విజయకుమార్‌లకు గాయాలైయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం వారిని బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకుంటున్న హరికథ కాలక్షేపం


హరికథ చెబుతున్న కళాకారులు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరులో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం కర్ణుడి జననం హరికథా భాగవతారిని భక్తులకు వినిపించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హరికథ భాగవతారిని గీత కర్ణుడి జననం కళ్ళకు కట్టినట్టుగా భక్తులకు వినిపించారు. ప్రక్క వాయిద్యాలుగా తబలా డమ్ము, హార్మోనియం సురేష్ వీనల విందుగా కథానిక అనుగుణంగా రాగయుక్తంగా శ్రోతలకు వినిపించారు. కాగా రాత్రివేళ వీధి నాటకాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

నాగరికతకు చిహ్నం పరిశుభ్రత



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పరిశుభ్రత నాగరికతకు చిహ్నంగా నిలుస్తుందని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం కళాశాలలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల చేత పరిశుభ్రతకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత నాగరికతకు చిహ్నంగా నిలుస్తుందని, జాతిపిత మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకుని తమను తాము పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తమ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నారాయణమూర్తి, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ గణేష్, శశికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని కందూరు, 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామాలలో పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టి దోమలు ప్రబలకుండా అంటువ్యాధులు రాకుండా మిలాథిన్ మందును స్ప్రే చేయడం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయురాలు లీలావతి సొంత నిధులతో విద్యా సామగ్రిని సమకూర్చారు. శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ఎంఈవో ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగరాజ రెడ్డి, వెంకటాద్రి నాయుడు, శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండుగ జరిగిన పది రోజుల తరువాత ఏటా ఈ ఊరిలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా గురువారం రాత్రి విగ్రహాన్ని ఏర్పాటు చేసి వైభవంగా పూజలు చేపట్టారు. ఏర్పాటు చేసిన చలువ పందిళ్ళు, అలంకరించిన విద్యుత్ దీపాలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం నిర్వాహకులు 1000మందికి అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయపురం ఎస్ఐగా బలరాం


ఎస్ఐ బలరాం


ప్రజాశక్తి-విజయపురం: విజయపురం ఎస్ఐగా బలరాం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కదిరి టౌన్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తూ బదిలిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకు ఏఎస్ఐ గోవిందరాజులు, హెచ్‌కానిస్టేబుల్ చెంగయ్య, జనార్ధన్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జెడ్పీటీసీకి పరామర్శ


జెడ్పీటీసీని పరామర్శిస్తున్న నారాయణస్వామి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ఎస్ఆర్ పురం జెడ్పీటీసీ రమణ ప్రసాద్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురైయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి శుక్రవారం మంగుంటకు వచ్చిన రమణప్రసాద్‌రెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట నాయకులు మణి, అనంతరెడ్డి, గురువారెడ్డి, కుప్పయ్య, జనార్ధన్, మహేష్, సాము తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: మండలంలోని నడుమూరు పంచాయితీ హంసాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆరంభమైంది. సర్పంచ్ మాధమ్మ ఆధ్వర్యంలో మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్ కుమార్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించి పనులను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశానుసారం కుప్పం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా హంసాపురం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సంతోష్, నాగరాజు, కుమార్, పలని, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని బెగ్గిలిపల్లి పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టినట్లు టీడీపీ మండల అధ్యక్షులు టిఎం బాబు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రశాంతంగా వార్డు కార్యదర్శుల బదిలీ ప్రక్రియ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగర, పురపాలక సంఘాల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు.. నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ కేటగిరీల్లో బదిలీల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు వారికి కేటాయించిన కౌంటర్లో రిజిస్ట్రేషన్ చేసుకుని సంబంధిత అధికారుల వద్ద కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అధికారుల బృందం కేటగిరీల వారీగా అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. వార్డు కార్యదర్శుల వారీగా క్యాటగిరి ప్రకారం కౌన్సెలింగ్ సజావుగా పూర్తి చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వార్డు అడ్మిన్ కార్యదర్శులు–18, ప్రణాళిక కార్యదర్శులు–18, అమినిటీ కార్యదర్శులు–15, వార్డ్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు–16, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు–17, వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్యదర్శులు– 30 చొప్పున మొత్తం 114 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, పలమనేరు, పుత్తూరు, పుంగనూరు, నగరి కమిషనర్లు, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఏసీపీ రామకృష్ణుడు, ఇంజనీరింగ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

33 అంగన్వాడీ కేంద్రాలకు మహర్దశ

- అత్యాధునిక సౌకర్యాల కల్పనకు కృషి
- విలేకరులతో సీడీపీవో మాధవి లత



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి, వీకోట మండలాల పరిధిలో 73అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 33అంగన్వాడి కేంద్రాలకు మహర్దశ రానుందని ఐసిడిఎస్ సీడీపీవో మాధవి లత తెలిపారు. శుక్రవారం ఆమె బైరెడ్డిపల్లిలో మాట్లాడుతూ మండలంలో 33 అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు కావలసిన మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. చిన్నారుల్లో సృజనాత్మకత, ఇతరుల పట్ల ప్రవర్తించే తీరు, వ్యక్తిగత అభివృద్ధి వంటి విషయాల్లో రాణించే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన అంగన్వాడీ కేంద్రాల్లో కిచెన్, గార్డెన్, ఫ్లోరైజ్ బాక్స్, డిజిటల్ స్క్రీన్ ఎల్ఈడి, వాటర్ ప్యూరిఫై వంటి సౌకర్యాలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పిడి నాగమణి జూమ్ మీటింగ్ ద్వారా ఆదేశించినట్లు ఆమె చెప్పారు. ఈ మెరుగైన సౌకర్యాలు అందించే కార్యక్రమం ముమ్మరం చేపడతామన్నారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లి అంగనవాడి సూపర్వైజర్ రమాదేవి, సుజాత, లత, రాధా, మాధవి పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకి నివాళి


వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని నివాళులర్పిస్తున్న సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-సోమల: సోమల సింగిల్ విండో ఛైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఒంగోలు జిల్లా నిడమనూరుకు ఆయన మృతదేహాన్ని తరలించారు. సమాచారం తెలుసుకున్న వైసీపీ యువనేత పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి నిడమనూరుకు వెళ్లి వెంకటేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పించారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ శ్రీరాములు, పొదలకుంటపల్లె ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి, పలువురు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యానికి మేలు


విజయపురం: అవగాహన కల్పిస్తున్న సీడీపీవో కృష్ణవేణి

ప్రజాశక్తి-విజయపురం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. మండలంలోని పీఆర్ కండ్రిగ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషక మసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. బాలామృతంతో వండి వంటలు తయారు చేసి పిల్లలకు ఎలా తినిపించాలో తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా 5సంవత్సరాలలోపు చిన్నారులకు జంక్ ఫుడ్ పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, చామండేశ్వరి, ఇందు, భారతి, అముద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలో రంగాపురం అంగనవాడి కేంద్రంలో చిలకమ్మ అధ్యక్షతన పౌష్టికాహార మాసోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ నజ్మా ముఖ్య అతిథిగా హాజరైనారు. అంతకు ముందు పురవీధుల్లో విద్యార్థులు స్థానిక ప్రజలతో కలిసి నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ లతా, అంగనవాడి హెల్పర్ పరిమళ, స్థానికులు, గర్భవతులు బాధితులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలి: ఐటిఐ ప్రిన్సిపల్

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ వి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజ్, సిడాప్, డిఆర్‌డిఏ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని గవర్నమెంట్ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి నెలా ఇంటి జాబ్ మేళాలు గవర్నమెంట్ ఐటిఐ కాలేజీలో నిర్వహిస్తున్నామని ఈ సదవకాశాన్ని జిల్లాలో యువతీ, యువకుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళాకు వివిధ రంగాలకు చెందిన నాలుగు బహుళ జాతీయ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు హాజ రయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్ లోకనాథం మాట్లాడుతూ ఇందులో భాగంగా నేడు జరిగిన జాబ్ మేళాకు 102 మంది యువతీ, యువకుల వివిధ కంపెనీలలో ఇంటర్వ్యూలకు హాజరుకాగా 69 మంది యువతీ, యువకులు వివిధ కంపెనీలలో ఉద్యోగ అర్హత పొందారని తెలిపారు. ఎంపికైన వారందరికీ అభినంద నలు, ఆఫర్ లెటర్లు ముఖ్య అతిథులు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గంగాధరం, ఐటిఐ కళాశాల, ఏ గణేష్, సునేషు, ఓ హిమబిందు, శ్రీలక్ష్మి, మహేష్‌లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాకాణిని కలిసిన సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి -కోట : మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్ రెడ్డిని కోట మండలంలోని చెందోడు పంచాయతీకి చెందిన వైసిపి గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షులు చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్ రెడ్డి జిల్లా అధ్యక్ష పదవిని దక్కించుకోవడంతో ఈ సందర్భంగా ఆయనను కలిసి అభినందనలు తెలిపామని చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. కాకాని గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావడానికి వచ్చే ఎన్నికల్లో మంచి మెజార్టీ వచ్చేలా తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు.

టేబుల్ టెన్నిస్‌లో బృందావన్ విద్యార్థుల ప్రతిభ


చిత్తూరు: బృందావన్ పాఠశాల విద్యార్థులు


బైరెడ్డిపల్లి: క్రీడల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రకాశం నర్సరీ పాఠశాల కాకినాడలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో విజయవాడ రీజియన్ సీబీఎస్ఈ పాఠశాలలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో చిత్తూరు నుంచి పాల్గొన్న బృందావనం సిబిఎస్ఈ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. హర్షిత్ 8వ తరగతి, విష్ణు 8వ తరగతి , రెడ్డిప్రసాద్ 8వ తరగతి, రిషి 7వ తరగతి, బాలికలు నీతుశ్రీ 9వతరగతి, దేవశ్రీ విజేతలుగా నిలిచారు. ఛాంపియన్షిప్ పోటీలకు సుమారుగా 30 సీబీఎస్సీ పాఠశాలలు పాల్గొన్నారు. మొదటి మ్యాచ్ బాలుర విభాగంలో రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన శాంతినికేత సీబీఎస్ స్కూల్‌తో తలపడి మొదటి విజయం అందుకున్నారు. గెలుపొందిన చిన్నారులకు పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి, పాఠశాల డైరెక్టర్ ప్రియ తేజ చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న కొచ్ మురళి, పీడీ బేబీ రాజ్, పీఈటీ హేమలత చిన్నారులకు అభినందనలు తెలిపారు.

అండర్ 14 క్రీడా పోటీల్లో..

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో అండర్–14 వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో సుబ్రమణ్యం హాజరైయ్యారు. మండలంలోని 12 పాఠశాలలకు చెందిన సుమారు 400మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాలొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 48మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. అక్కడ ప్రతిభ చూపితే జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించే అవకాశం ఉందని పీఈటీ మాస్టర్ చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో నసీప్ జాన్, సుజాత, అమరావతి, చిన్నారులు పాల్గొన్నారు.

ఎస్వియూ క్యాంటీన్ టెండర్ల ఖరారు

ప్రజాశక్తి- క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అన్నపూర్ణ, సంపూర్ణ క్యాంటీన్లకు టెండర్లు పిలిచి శుక్రవారం దరఖాస్తులను పరిశీలించి, అత్యధికంగా కొటేషన్ చేసిన వారికి క్యాంటీన్ల నిర్వహణను అప్పగించారు. ఎస్వీయూ కుల సజీవుల కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలించి, అత్యధికంగా దరఖాస్తు కొటేషన్ చేసిన జయశేఖర నాయుడుకు రెండు క్యాంటీన్లను అప్పగించారు. అన్నపూర్ణ క్యాంటీన్ కు ఒక లక్ష పదివేల రూపాయలు నెలకు బాడుగగా నిర్ణయించగా, సంపూర్ణ క్యాంటీన్ కు 45 వేల రూపాయలు నెలకు బాడుగగా అత్యధిక కొటేషన్ చేసిన జయ శేఖర్ నాయుడుకు టెండరును ఖరారు చేశారు. ఎంతో కాలంగా వర్సిటీ క్యాంటీన్లు మూతపడి ఉండటం విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది తీరా ఇబ్బందులకు గురయ్యారు. దీంతో వర్సిటీకి కొంతమేరకు ఉపశమనం కలిగిందని సకాలంలో భోజన ఇతర సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని వర్సిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నూతన క్యాంటీన్లో నాణ్యమైన భోజనం, టిఫిన్ టెండర్ లో పలికిన ధరలకు అందుబాటులోకి తీసుకొస్తాయని విద్యార్థి సంఘం నేతలు ఆశిస్తున్నారు.

శ్రీసిటీ సీఎఫ్ఓకు సిఐఐ 'సీఎఫ్ఓ ఎక్సలెన్స్' అవార్డు

ప్రజాశక్తి- సత్యవేడు: శ్రీసిటీని మరో ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సంస్థ వారి 'సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డ్' శ్రీసిటీ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) ఆర్.నాగరాజన్ కు దక్కింది. గురువారం బెంగుళూరులో నిర్వహించిన సదరన్ రీజియన్ సిఐఐ సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డుల మూడవ ఎడిషన్ కార్యక్రమంలో ఈ అవార్డును అందించారు. సిఐఐ మాజీ ప్రసిడెంట్, ఇన్ఫోసిస్ కో–ఫౌండర్, యాక్సిలర్ వెంచర్స్ ఛైర్మన్ క్రిస్ గోపాలకృష్ణన్, సిఐఐ సిఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2023–2024 ఛైర్మన్, భారత్ వోల్వో గ్రూప్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ కమల్ బాలి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. మౌలిక వసతుల కల్పన రంగంలో ఆర్థిక నిపుణుడుగా తాను చూపిన అసాధారణమైన ప్రతిభ, కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ ప్రతిష్టాత్మిక అవార్డు గెలుచుకోవడం తమకు చాలా గర్వంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన హరిప్రసాద్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను చిత్తూరు ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ శుక్రవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావడానికి కృషి చేయాలని హరిప్రసాద్ కు సూచించారు. హరి ప్రసాద్ మాట్లాడుతూ 100 రోజుల పాలనలో సంతృప్తిగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేన బలోపేతం కావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయనకు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటా: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి -కోట : ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. కోట మండలంలోని ఉత్తమ నెల్లూరులో టిడిపి నాయకులు జంగిటి కృష్ణయ్య ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం 'ను శుక్రవారం నిర్వహించారు. తాటిగుంట చెరువు గిరిజన కుటుంబాలకు సమీపంలో ఉన్న రోడ్డు పక్కన జంగిటి కృష్ణయ్య సొంతంగా నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సునీల్ కుమార్ వంద రోజుల పాలనలో సాధించిన విజయాలను వివరించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు వుంటే తమకు తెలిపితే పరిష్కరిస్తానని తెలిపారు. గతంలో చిట్టేడులో గిరిజనులకు శ్మశాన స్థలం లేదని, గత ప్రభుత్వ హయాంలో ఓ వ్యక్తి శ్మశానాన్ని ఆక్రమించాడని ఆరోపించారు. ఈ విషయం తహశీల్దారు వెంటనే స్పందించి ఆ స్థలంలో అర ఎకరా శ్మశానాన్ని కేటాయించారని స్థానికులు గుర్తు చేశారు. ఉత్తమ నెల్లూరు పంచాయతీలో అర్హులైన నిరుపేదలకు వంద పక్కా గృహాలను మంజూరు చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమ రెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్ రెడ్డి, జలీల్ అహ్మద్,కోటారెడ్డి నెల్లూరు మోహన్ రెడ్డి, కొనిశెట్టి రమేష్,తీగల సురేష్ బాబు,దారా సురేష్ కోకర్ల మధు యాదవ్, పొక్కాళి సుధాకర్ శెట్టి, బాలాజీ శెట్టి, జంగిటి కృష్ణయ్య, ఆకుల ప్రసాద్ యాదవ్, రవీంద్రారెడ్డి, చంగల్ రావు, మురళి, దిలీప్, నౌషద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అన్నీ శాఖాధికారులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

జాతర నిర్వహణ ఏర్పాట్ల సమావేశంలో జెసి


సమావేశంలో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి- వెంకటగిరి-డక్కిలి: వెంకటగిరి పోలేరమ్మ జాతరను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ పేర్కొన్నారు. పట్టణంలోని పింజల వీరయ్య కళ్యాణ మండపంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసి శుభం భన్సాల్ మాట్లాడుతూ అధికారులకు నిర్దేశించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ సామాన్య భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అధికారులను, జాతర కమిటీ నిర్వాహకుల సభ్యులను సమన్వయం చేసుకుని జాతర విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గూడూరు సబ్ కలెక్టర్ రామవేంద్రమి మాట్లాడుతూ జాతర నిర్వహణలో దేవాదాయ, పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపక, ఆర్టీసీ, విద్యుత్, మున్సిపల్, ఆర్ అండి, విద్య, వైద్య, రెవెన్యూ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గూడూరు డిఎస్పి రమణకుమార్ మాట్లాడుతూ జాతర బందోబస్తుకు 1200 మంది పోలీసులను నియమించి క్లస్టర్లుగా విభజిస్తామని తెలపారు. జేబు దొంగల నివారణకు మఫ్టీలో కొందరు పోలీసులను నియమిస్తా మన్నారు. రిజర్వుడ్ పార్టీని పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. తిరుపతి ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరామ్ మాట్లాడుతూ పూర్తిగా మద్యపానం నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 25,26 తేదీల్లో వెంకటగిరి పట్టణం సమీపంలో బ్రాందిషాపులు అన్ని 48 గంటల పాటు మూసివేస్తామని తెలిపారు. పట్టణ సరిహద్దు ప్రాంతాల్లో తను అధికారులతో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వెంకటగిరి డిపో మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ వెంకటగిరి డిపో నుండి అదనంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామని ప్రస్తుతం 80 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటుతో పాటు ఆత్యవసర అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు వైద్యశాఖ అధికారులు తెలిపారు. దేవాదాయశాఖ, మున్సివల్ శాఖ , ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి రవి మనోహరాచారి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, ఎంపిపి తనుజారెడ్డి, దేవాదయశాఖ ఈవో శ్రీనివాసులరెడ్డి, మున్సివల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, సీఐ ఏవీ రమణ పాల్గొన్నారు.